# నారాణి

విద్వాన్ మల్సాని సత్యనారాయణ

*రాణి గులాబీలు తెస్తుందని అతడి నమ్మిక. తోటలోని గులాబీలు అన్నీ మొగ్గలతో సహా ఎవరో తుంచేశారని తెలిసి ఆ అమాయక హృదయం భగ్నమైనదని అతడికేం తెలుసు ?*

---

'బాబూ!...బాబూ..!

మృదు మధురమైన కంఠధ్వని.

సన్నని మెత్తని పొడుగాటి వేళ్ళు ఉంగరాలు తిరిగిన ముంగురులను పైకి నెట్టుతూ జుత్తు లోనికి పోయి సర్దుతున్నాయి.

జలపూరిత నయనాలను తుడుచుకుంటూ తలపైకెత్తాడు చినబాబు.

'ఏం పనది బాబూ! తప్పుకదూ? ఏడుస్తారా?'

'ఏం చెయ్యను? నేను చెయ్యగలిగింది ఇంతేగా? ఎంత ఏడ్చినా లోని దుఃఖం తరగడం లేదు. హృదయం పగలడం లేదు.' మళ్ళీ తలవంచుకున్నాడు.

'ఇటు చూడు బాబూ!'

తలపైకెత్తి ఆ స్త్రీమూర్తి కళ్ళల్లోకి చూచాడు.

'ఈ రోజు.....'

'అవును. ఈరోజు దీపావళి.'

'క్రిందటి దీపావళి జ్ఞాపకం ఉందా?'

'ఉంది, ఉంటుంది. జన్మ జన్మాంతరాలకూ జ్ఞాపకం ఉంటుంది. ఆనాటిరాత్రి అబాల గోపాలం బాణసంచాను తగలబెట్టగా వచ్చిన అగ్నికీలలకు ఆనందబాష్పాలు రాలుస్తుంటే విర్భాగ్యుడైన నేను దూరంగా నారాణి పవిత్ర శరీరాన్ని ఆహుతిగొంటున్న అగ్నికీలలను సౌధాగ్రం నుండి చూచి అశ్రుకణాలు రాల్చాను.'

'చాలు బాబూ! ఆరోజు నీకు జ్ఞాపకముంటే అంతేచాలు. అదే నాకు పదివేలు. దిక్కులేని నేను చచ్చిపోయేటప్పుడు కాకపోయినా చచ్చిపోయాక అయినా నాకోసం పరితపించే కన్నీటిని చూడగలిగాను. మానవజన్మ ఎత్తినందుకు నా జన్మ సఫలమైందనే ఆనందం ఇప్పుడు కలిగింది. ఇదేనాకు కోటి స్వర్గాలు......'

నిదానించి చూచాడు బాబు ఆ స్త్రీ మూర్తి వంక.

ఇంకెవరు? తనరాణి!

నోటమాట రాలేదు.

కన్నీరు మున్నీరుగా కారుస్తున్నాడు.

'ఏడవకు బాబూ' అంటూ ఆ స్త్రీమూర్తి రెండు చేతులతో బాబు తలను హృదయానికి హత్తుకుని పమిటిచెరగుతో కళ్ళుతుడుస్తూ—

'ఏడవకుబాబూ' అని సముదాయిస్తుందేగాని తన కన్నీరు కట్టడం లేదు. రెండు చేతుల లోనికి బాబు ముఖాన్ని తీసుకొని కళ్ళల్లోకి చూస్తూ—

'చూడు బాబూ! లేగులాబీలు వికసించి సౌరభాన్ని వెదజల్లుతున్నాయి. ప్రతిరోజూ వికసించిన గులాబీలు యీనా ప్రేమద్వైవానికే అర్పించుకున్నాను. ఒక్కరోజునా నా యీశిరోజాలను అలంకరించుకోలేకపోయాను. కాని ఇప్పుడు మాత్రం... ఏదోకోరిక. గులాబీల మీద మమత..బాబూ! .. ఆవికసించిన గులాబీలను..... నీచేతులతో.... నాయీ శిరోజాలలో తురిమి.......'


ఎవరో 'బాబూ, బాబూ' అంటూ తట్టి లేపుతున్నారు. మెలకువ వచ్చింది బాబుకు.

ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా తల్లి.

కంగారుగా 'ఏదీ నారాణి?' అన్నాడు బాబు.

తల్లికి నోటమాట రాలేదుగాని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బాబు కళ్ళవెంబడి కారే కన్నీటిని తుడుస్తూ 'ఏటికేడాదయింది, ఆతల్లి మనల్నివదలి' అంది.

అర్థం చేసుకున్నాడు బాబు. తనకు కల వచ్చిందని ఇప్పుడు అవగతమైంది. పొరలివచ్చే దుఃఖాన్ని దిగమింగాలని ప్రయత్నిస్తున్నాడు. మధుర స్వప్నం భగ్నమైనందుకు పరితపిస్తున్నాడు.





మసిపాతను కట్టేన మాణిక్యాన్ని ఏలా తీర్చి దిద్ది తన దానివిగా చేసుకోవాలని అహోరాత్రం అటమటించాడో ఆ తీర్చి దిద్దిన రాణినే చూడ కలిగాడు క్షణకాలమైనా బాబు కలలో.

కిటికీలోనుండి బయటికి చూశాడు. చీకటిని చీల్చి చెండాడుతున్న కాంతిపుంజాలు. కాంతి పుంజాలకు స్వాగతమిచ్చే పక్షుల కిలకిలా రావాలు.

విచ్చి విరజిమ్ముతున్న పుష్పసౌరభాలు.

సౌరభాలతో మత్తెక్కిన బంభరాలు.—

ప్రశాంత వాతావరణాన్ని చీల్చుకునివచ్చే పిల్లతెమ్మెరలు. పిల్లతెమ్మెరల తాకిడితో జ్ఞప్తికి వచ్చే మధుర భావనలు. మధుర భావనల అనుభూతితో వెలికురికే బాష్పకణాలు.

తోటలో మధ్యగా తల్లిదగ్గరనుండి సర్వాంగ సుందరంగా కట్టించిన రాణి సమాధి కన్నీటి తెరలలో మసక మసగ్గా కనిపిస్తూంది.

సమాధిచుట్టూ ఉన్న గులాబీ మొక్కల నిండా వికసించిన గులాబీలు సమాధికి అలంకరించిన పుష్పహారంలా ఉన్నాయి.

గాలికి రెపరెపలాడుతూ వికసించిన గులాబీ కిటికీలోనుండి తొంగి చూస్తూంది.

ఒళ్ళు ఝల్లుమంది.

రెప్పవాల్చకుండా చూస్తున్నాడు, ఆ తే గులాబీవంక. ఆ తే గులాబీలో.... తనరాణి... అవును రాణే...తన కోసం చేతులు చాచి రమ్మంటూంది.

ఏదో భ్రమ. అంతకుమించిన తొట్రుపాటు. మరుక్షణంలోనే అంతులేని ఆవేదన.

ఒకనాటి సంఘటన హృదయాన్ని తట్టి జ్ఞప్తికి వచ్చింది బాబుకు.

కిటికీవద్దకువచ్చి కిలకిలానవ్వుతూ 'చిన బాబూ! నీకు గులాబీలంటే ఇష్టమేనా?' అని అడగడం, తానా అమాయకపు నూతన యౌవనవతిని గూర్చి మాట్లాడలేక పోవడం, అంతలోనే తీసుకువస్తానంటూ గాలిలోకి రివ్వున పరుగెత్తుతూ తోటలోని మొక్కల చాటుకు దూసుకుపోయే ఆరాణి......

అంతలో కొద్దిరోజుల క్రితమే పనిలో ప్రవేశించిన తోటమాలి వచ్చి 'పిచ్చిపిల్ల. ఏమీ తెలవదు బాబూ! చిన్నప్పుడే తలిదండ్రులు కరువైయ్యారు.' బిడ్డపాపలేని నాకు భగవంతుడు ఆ పిల్లను వప్పగించాడు. గాలికి పెరుగుతోంది. తోట పువ్వులు ఉంటేచాలు. అన్నం నీళ్ళు అక్కర లేదు. అందులో గులాబీలంటే పంచప్రాణాలు. చెట్టుమున్నగులాబీ ఎవరైనా కోస్తే తన గుండెలో ముల్లు గుచ్చుకున్నట్లే బాధపడుతుంది. భగవంతుడు అంత అందంగా మలిచిన పుష్పాన్ని ధరించడానికి అంత అందమైన హృదయం గలవారికే అధికారం ఉంటుందంటుంది'—

అంటూ ఆనందబాష్పాలు తుడుచుకుంటూ ముందుకు సాగిపోయాడు.

తనకళ్ళు వెతుకుతున్నాయి ఆ అమ్మాయి కోసం.

దోసిలినిండా గులాబీలతో పరుగెత్తుకు వచ్చింది రాణి. 'బాబూ! దోసిలిపట్టు' అంది.

గాలికి ముంగురులు ఎగిరి ముఖంమీదపడుతున్నాయి. కనీసం కొబ్బరినూనెకైనా నోచుకోని ఆ ముంగురులను జూచి జాలిపడ్డాడు చిన బాబు.

వయసుతోపాటు వికసిస్తున్న శరీర సౌందర్యాన్ని దాచుకుందుకైనా చాలీచాలని అవమాసిన గుడ్డ పీలికలు చినబాబు హృదయాన్ని కలచి వేశాయి.

మసిపాత మాటున మాణిక్యం.

పంకంలో పెరిగిన పంకజం.

ప్రకృతి అనే పంజరంలో బంధింపబడ్డ రామచిలుక. లోకం అనే బందిలిదొడ్లో అడుగిడని మేకపిల్ల.

భావావేశంలో క్షణకాలం మౌనం.

'ఏమిటి బాబూ, అలా చూస్తావు దోసిలి పట్టమంటే?' అంటూ కొంచెం అధికారం కళ్ళతో చెలాయించనా అంతలోనే కిలకిలమని నవ్వేసింది రాణి.

రెండవసారి విన్న ఈ కిలకిలారావం చిన బాబు హృదయానికి చక్కిలిగింత పెట్టింది.

'నీ పేరు?'

'నాకు తెలవదు. మా తాత మాత్రం రాణీ అని పిలుస్తాడు.'

'పాపం. చిన్నప్పుడే అమ్మ, నాన్న చచ్చి పోయారా?'

చటుక్కున తల పైకెత్తి చూచింది.

గిరుక్కున కన్నీరు చిందింది.

తలవంచేసింది.

'అవును బాబూ! చిన్నప్పుడే అమ్మని నాన్నని మింగేశాను' అంది దురదృష్టవంతురాల్ని అనే భావాన్ని వెల్లడి చేస్తూ.

కన్నీరు బుగ్గలనుండి దిగజారింది.

కంఠం మాటరాకుండా మూగవోయింది.

చినబాబు మనస్సు బాధపడింది.

మానిన గాయాన్ని మళ్ళీ రేపాడు.

జారిన కన్నీటికి కారణ మయ్యాడు.

చేసిన పొరబాటుకు సిగ్గుపడ్డాడు. మౌనం మనస్సును మరీ బాధపెడుతుందనుకున్నాడు.

'రాణీ!'

తలపైకెత్తింది.

నీళ్ళతో నిండిన కళ్ళు.

గులాబీలతో నిండిన దోసిలి.

తుడుచుకుందుకు వీలులేదు.

తాను ఆకళ్ళను తుడుద్దామనుకున్నాడు. కాని కిటికీ ఊచలు అడ్డుగా ఉన్నాయి. అయితే కష్టాలు జీర్ణించుకున్న రాణికి కళ్ళనీళ్ళు కళ్ళలోనే ఇంకి పోయాయి.

'నిండుగా వికసించాయికదూ, గులాబీలు, రాణీ!'

'అవును బాబూ!

'వికసించిన గులాబీలు.

'మై మరపించిన గులాబీలు.

'తగిన స్థానంకోసం తపనపడే గులాబీలు.'

ఆమాటల పొందికకు ఆశ్చర్యపోయాడు బాబు.

'అంటే!' అన్నాడు అప్రయత్నంగా.

'సమానమైన సుందరత్వం
సున్నితమైన మృదుత్వం.
కలిగిన హృదయ మందిరంలో
నెలవుకోసం కలవరిస్తున్నాయి.
చెలిమికోసం పలవరిస్తున్నాయి.'

శరీరం పులకరించింది బాబుకు.

లయ తప్పని పలుకుల పొందిక.

పొరవోని మాటల మన్నన.

క్షణం ఆగి—

'చదువుకున్నావా రాణీ?' అని అడిగాడు.

'ఏదో మీదయవల్ల కొద్దిగా చదుపుకొన్నాను. రామాయణం చదువుతున్నాను. మా తాత అర్థం చెబుతున్నాడు.'

'నాక్కూడా చదివి వినిపిస్తావా?'

'కించ పరచకండి.'

'అంటే?'

'ఏమీలేదు బాబూ! దోసిలి పట్టండి.'

'ఎందుకు?'

'ఈ గులాబీల కోసం.'

'అంత సుందరత్వం నా హృదయంలో లేదనుకుంటాను రాణీ!'

'ఉందో లేదో నాకు తెలుసు. ఈరోజువరకు నేను నాచేత్తో వికసించిన గులాబీలు ఎవరికీ యివ్వలేదు. మీకు యివ్వాలని బుద్ధిపుట్టింది!'

'ఎందుచేత?'

'మీ హృదయంలో ఈ లేతగులాబీలకన్న ఎక్కువ సౌందర్యం, మృదుత్వం దాగి ఉన్నాయి గనక!'

'ఎట్లా చెప్పగలవు?'

'నీలాకాశంలోనికి రెప్పవెయ్యకుండా చూస్తూ గాలికి పయనించే వింతరంగుల మేఘాలతో గంటలతరబడి ప్రయాణం చేస్తున్న మనస్సు, ఉషఃకాంతులు వెదజల్లే సమయాన తీర్చి దిద్దుకుంటున్న ప్రకృతి సౌందర్యానికి పరవశమై చలనములేక తదేక నిష్ఠలో ఉండే మీ శరీరము, విచ్చినపూలు రాలి నేలపాలయితే నొచ్చిన హృదయంతో చెమర్చిన నేత్రద్వయం, భగవంతుడు ఊహామాత్రమున వివిధరంగుల కుంచెలతో చిత్రించిన అమాయకపు పక్షుల ఆనంద పారవశ్యంలో పాలు పంచుకుంటూ వాని కిలకిలా రావాలకు ముగ్ధులై ముఖంలో చిందులాడే చిరునవ్వు. ఏవన్ని చెప్పను? ఇవన్నీ మీ హృదయంలోని లాలిత్యాన్ని, మీ హృదయంలోని సౌందర్యాన్ని వ్యక్తపరచడం లేదా చినబాబూ!'

మాట్లాడలేక పోయాడు చినబాబు.

ఆలోచనా సముద్రంలో ఈదులాడుతూ ఆమె హృదయపుటంచులను చేరడానికి కూడా అనర్హుడనని నిర్ధారణ చేసుకుంటున్నాడు.

'దోసిలి పట్టు బాబూ!'

చైతన్య రహితుడై కిటికీ మూడు ఊచల మధ్యనుండి రెండుచేతులుచాచి దోసిలిపట్టాడు. రాణి లేగులాబీలను ఆదోసిట్లో పోసి కిలకిలా నవ్వుతూ పరుగెత్తుకుపోయింది, మధ్య మధ్య వెనక్కు తిరిగి చూస్తూ.

వేటకాడు విడిచిన బాణంలా దూసుకు పోయింది తోటలోకి రాణి. మన్మథుడు విడిచిన బాణంలా ఆమె చూపువచ్చి బాబు గుండెల్లో గ్రుచ్చుకుంది.

మూడవసారి విన్న ఈ కిలకిలారావం ముగ్ధుని చేసింది. నిశ్చేష్టుడై రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. దోసిలిలో వికసించిన గులాబీలు తనను చూచి నవ్వుతున్నట్లనిపించింది. సిగ్గుపడ్డాడు. దోసిలి తీసుకోవాలనుకున్నాడు. కిటికీ ఊచలు అడ్డం వచ్చాయి. తన తెలివి తక్కువ తనానికి సిగ్గుపడ్డాడు.

ఎట్లా? చేతులు తీసుకుంటే పువ్వులు పడి పోతాయి. తప్పనిసరైంది. చేతులు తీసుకున్నాడు. గులాబీలు పడిపోయాయి. మనస్సు బాధపడింది. గిర్రున తిరిగి తోటలోనికి వెళ్ళాడు. పూలన్నీ మట్టి పాలయ్యాయి. ధూళి ధూసరితమైన ఆ గులాబీలను చేపట్టడానికి ఎందుకో మనసు అంగీకరించలేదు. చేతులు దులుపుకుని లోనికి వచ్చాడు చినబాబు.

మరునాడు అదే వేళకు రాణి గులాబీలు తెస్తుందని బాబుకు తెలుసు. తోటలోనే తారట్లాడుతున్నాడు. రాణి రానూ వచ్చింది. గులాబీలు బాబు దోసిలిలో పొయ్యనూ పోసింది. కిలకిల నవ్వులను బాబు హృదయంతోపాటు తోటనిండా వ్యాపింపజేసి వెళ్ళనూ వెళ్ళింది.


మూడవనాడు, నాల్గవనాడు, రోజూ—బాబు నిశ్చేష్టుడై దోసిలి పడతాడు. అంతే. రాణి కళ్ళల్లోకి చూస్తాడు. తనను తానే మరుస్తాడు.

ఒక రోజున రాణి పువ్వులతోవచ్చింది. 'దోసిలి పట్టు బాబూ' అంది.

'ఈ తోటలోని పువ్వులన్నీ మొగ్గలతోసహా ఎవరేనా త్రుంపివేస్తే అప్పు డేం చేస్తావు రాణీ?' అన్నాడు.

'అప్పుడా?' క్షణకాలం ఆలోచనలో పడింది రాణి. సమాధానంకోసం ఎదురు చూస్తున్నాడు చినబాబు.

'అప్పుడా? అప్పుడు నా హృదయాన్ని తరిగి, ఎర్ర గులాబీలుగా తయారుజేసి నీ దోసిలిలో పోసి, నీ దోసిలిలోనే ప్రాణాలు విడుస్తాను' అంది రాణి రెప్పపాటు లేని కళ్ళతో బాబు కళ్ళల్లోకి చూస్తూ.



తాజమహల్

చిత్రం—పి. అంజయ్య (గుండిమెడ)

'రాణీ' అన్నాడు చినబాబు.

ఆ పిలుపుతో పరవశమైన రాణి నవ్వుతూ దోసిలిలో పోసింది గులాబీలు.

గిర్రున వెనక్కు తిరిగింది.

తన పమిటి చెరగు ఎవరో లాగినట్టయింది. రెండు చేతులతో కళ్ళు మూసుకుని 'వదులు చిన బాబూ' అంది.

వదలలేదు.

'నా హృదయాన్నే తొలినాడు నీ దోసిలిలో ఉంచాను. పమిటి చెరగులో ఏముంది? వదులు బాబూ!'

వదలలేదు.

వెనక్కు తిరిగింది.

సిగ్గు పడింది.

పమిటి చెరగు లాగేది చినబాబు కాదు. ప్రక్కనే ఉన్న గులాబీ మొక్క ముళ్ళు.

తనలో తనే నవ్వుకుంది.

చినబాబుకూ నవ్వు వచ్చింది.

జాగ్రత్తగా పమిటి చెరగు తీసుకుంది రాణి.

'క్షమించు చినబాబూ! ఏవేవో అనేశాను' అని పరుగెత్తింది.

కనుమరుగయ్యేవరకు చూచాడు చినబాబు.

'పిచ్చిపిల్ల' అన్నాడు అప్రయత్నంగా.

వెనక్కు తిరిగాడు.

నిర్ఘాంతపోయాడు.

అడుగు ముందుకు పడలేదు.

కొద్ది దూరంలో తండ్రి. అసహ్య భావాన్ని ముఖంలో వ్యక్తపరుస్తున్నాడు. కొడుకు వంక చుర చురలాడుతూ చూస్తూ వెళ్ళిపోయాడు.

దారుణమైన ఆనాటి జీవిత సూత్రానికి కారకుడయ్యాడు ఆ కర్కశ హృదయుడు తండ్రి.

ఆనాటి సంఘటన అప్పుడప్పుడు బల్లెంతో హృదయంలో గ్రుచ్చుతూనే ఉంది.

అదొక సెలవేసిన గాయం.

అడుగడుక్కూ రేగుతున్న గాయం.

కన్నీరు మున్నీరై కాల్వలు గట్టిన గాయం. తన రాణి పలికిన లయుతప్పని పలుకుల పొందికను పొరవోవని మాటల మన్ననను మననం చేస్తూనే ఉంటాడు.

గాయంలోని బాధ చిలకరిస్తూనే ఉంటుంది.

భావంలోని రాణి పలకరిస్తూనే ఉంటుంది.

కాల గమనాన్ని స్మరించకుండా నాటి ఘట్టాన్ని తలుస్తూనే ఉంటాడు. ఆనాటి రాణిని విస్మరించకుండా విలపిస్తూనే ఉంటాడు.

తన రాణినే రాణిగాజేసి వ్యధలన్నీ కథలుగాజేసి తానే రాజననుకుని కలలు కంటాడు. కలల్లోనే కరిగిపోతా నంటాడు.

అనుక్షణమూ అవకాశంలో రాణినిచూస్తాడు.

మనో నేత్రంతో పలకరిస్తాడు.

సంఘటనలన్నీ ఒకదాని వెనుక ఒకటి ఆ ప్రశాంత ప్రాతఃకాలంలో వికసించిన గులాబీ కిటికీలోనికి తొంగి చూచేసరికి మనస్సులో తిరిగి తిరిగి బాబును పలకరించాయి. ఏవేవో ప్రశ్నలు వేశాయి. సమాధానంకోసం ఎదురు చూచాయి. మూగవోయిన ఆకృతిని చూచి సరిపెట్టుకున్నాయి. చివరకు కాలగర్భంలో కలిసి పోతున్నాయి. చరిత్రలో వెనకడుగు వేస్తున్నాయి. ఒక రోజా, రెండు రోజులా? ఏటి కేడాది గడిచింది.

ఈనాడు మరల దీపావళి.

తదేక దృష్టితో చూస్తున్నాడు సమాధి వంక.

ఎడతెరిపి లేకుండా తడుస్తున్నాడు కన్నీటితో.

తల్లి వస్తుంది. చూస్తుంది. వెడుతుంది.

కొడుకు వేదనలో భాగం పంచుకుంటుంది.

భావనలోనయినా క్షణకాలం ఆనందం అనుభవిస్తాడనే ఆశతో కొడుకు మౌనానికి భంగం కలిగించ దా తల్లి.

గడియారం గంటలు కొడుతూనే ఉంది. కాని చినబాబు తదేక దృష్టికి భంగం కలిగించలేక పోతూంది. ప్రొద్దు గ్రుంకుతూంది.

తల్లి ఆ పవిత్రమూర్తి రాణి సమాధిపైన వికసించిన గులాబీలు బుట్టలతో తెప్పించి

# రాణి

కుప్పగా పోసి చుట్టూ లెక్కలేనన్ని దీపాలుపెట్టి వెలిగిస్తూంది.

చూచాడు చినబాబు.

అప్రయత్నంగానే లేచాడు.

సరాసరి సమాధివద్దకు వెళ్ళాడు.

ఎదురుగా నిలబడ్డాడు.

నిదానించి సమాధిలోనికి చూచాడు.

గులాబీల మధ్య తన రాణి.

అతిలోక సౌందర్యవతి తన రాణి.

అతి నాజూకయిన వస్త్రాలలో దేవతా మూర్తిలా వెలుగొందుతున్న తన రాణి.

రెండు చేతులు చాచి పిలుస్తూంది.

'రాణీ' అని అరిచాడు చినబాబు.

మతిచెడి పిచ్చివాడయి తిరుగుతున్న తోట మాలి దూరంగా పిచ్చిగా నవ్వుతూ, 'రాణి.... నీ రాణి......వస్తుంది. గులాబీలు తెస్తుంది—అని రాణి నీతో చెప్పమన్నది' అంటూ వెనక్కు తిరిగి చూస్తూ వెళ్ళిపోయాడు.

విన్నాడు చినబాబు.

'అవును. నా రాణి వస్తుంది. గులాబీలు తెస్తుంది. రాణీ' అని అరచి మనోనేత్రం తెరచి సమాధిలోనికి చూస్తూ రెండు చేతులు చాచాడు.

నవ్వుతూ రాణి కాంతిపుంజాలలోనే కరిగి పోయి సమాధిలోనే లీనమయింది.

కళ్ళు మూసుకున్నాడు చినబాబు.

రెండు చేతులు పైకెత్తి నమస్కరించాడు.

'అసమర్థుణ్ణి. దోసెడు గులాబీలు కూడా నీ కర్పించలేకపోతున్నాను. పట్టి దోసిలి సమర్పించుకుంటున్నాను' అని దోసిలి పట్టాడు.

దోసిలిలో ఎవరో గులాబీలు పోశారు.

చినబాబు రెండు కన్నీటి చుక్కలతోపాటు ఆ దోసెడు గులాబీల... ాణి సమాధిమీద విడిచాడు.

కళ్ళు విప్పి చూచాడు.

ఇంకెవరు? ఎదురుగా తన తండ్రి.



విషాద గాథ

ఫోటో—పి. శివశంకర్ (కలకత్తా-14)

'నాన్నా!' అన్నాడు చినబాబు.

మాట్లాడడానికి సిగ్గుపడ్డ ఆ తండ్రి కన్నీరు తుడుచుకుంటూ వెనక్కు తిరిగి వెళ్ళి పోతున్నాడు.

చినబాబు దోసిలి గులాబీలతో నింపి కొంత మనశ్శాంతి కలుగజేసుకున్నాడు.

కరుడు గట్టిన హృదయంతో తాను చేసిన కర్కశపు పనికి ఘోరంగా నిందించుకున్నాడు.

ఏం చేశాడు తాను?

ఒక్కసారి గతమంతా ఆ తండ్రికి స్ఫురణకు వచ్చింది.

ఆదిలో బాబుకు, రాణికి మధ్య మొలకెత్తిన అనురాగ భావాన్ని చూచాడు. తనకు స్వార్జితంగా కాకుండా అన్యాయంగా ఆక్రమించిన సిరి సంపదలు, హోదా మున్నగు ఇహలోక వస్తువు లన్నిటినీ కొలబద్దగాజేసి వారి పవిత్రమైన అనురాగ భావాన్ని స్వార్థంతో నిండిన తాను కొలిచి చూచాడు. కొలతకు అందలేదు.

అజ్ఞానం ఆవహించింది.

స్వార్థం తల త్తింది.

హృదయం కరుడు గట్టింది.

వారి అనురాగ బీజాన్ని మొలకలోనే త్రుంచెయ్యాలని ఆలోచించాడు.

తరువాత ఒకనాడు బాబుకు జబ్బు చేసింది.

డాక్టర్లు వస్తున్నారు; పోతున్నారు.

బాబును పరీక్ష చేస్తున్నారు.

తన పంచప్రాణాలూ ఒక్కగాని ఒక్క కొడుకు మీద పెట్టుకున్నాడు ఆ తండ్రి. అంతకంతకు శుష్కించిపోతున్నాడు బాబు.

బాబు బ్రతకాలంటే ఎవరేనా తమ రక్తాన్ని ఇవ్వాలని చెప్పారు డాక్టర్లు.

తన కొడుకుకోసం, పళ్ళు పాలతో పెంచిన తన రక్తాన్ని ఇవ్వగలడా? అమ్మో! ప్రాణం కన్న తీపి ఏముంది? ఈ సిరి సంపదలు, ఈ హోదా అనుభవించకుండా ప్రాణాన్ని చూస్తూ చూస్తూ బలి ఇచ్చేస్తే ఎట్లా?

ఇహలోక మమతతో పరిపరి విధాల ఆలోచిస్తున్నాడు ఆ తండ్రి.

ఎదురుగా సాక్షాత్కరించింది రాణి.

బాబుకోసం దిక్కు దిక్కులంటూ దిక్కుతోచక పోయి చూస్తూంది రాణి. బాబు కనబడడంలేదు. బాబు క్షేమం తెలియడంలేదు. ఆదరించే అమ్మగారు కనబడడం లేదు.

ఇంతలో కన్నీరు తుడుచుకుంటూ అమ్మగారు బయటకు వచ్చింది. చూచింది రాణి. 'బాబుకు ఎట్లా ఉంది?' అని అడిగింది.

'బాబు' అని బావురుమంది ఆ తల్లి.

గుండె చెదిరింది రాణికి.

'లాభం లేదంటున్నారు డాక్టర్లు' అంది ఆ తల్లి.

దుఃఖం పొర్లి వచ్చింది రాణికి. పైట చెరగు నోట్లో కుక్కుకుని వచ్చే దుఃఖాన్ని అపుకుని వెనక్కు తిరగబోయింది.

'రాణీ! అని పిలుపు వినిపించింది.

ఇటు తిరిగింది రాణి.

'ఇలా రా' అని అరిచాడు ఆ తండ్రి.

యముని పిలుపులా వినిపించింది రాణికి.

గుండెలు దడ దడ కొట్టుకున్నాయి.

కాళ్ళు తడబడుతూ దగ్గరకు వచ్చింది.

ఆ తండ్రి డాక్టర్లతో ఏదో ఇంగ్లీషులో చెప్పాడు.

ఒక డాక్టరు చిన్న పిన్నుతో రాణి వ్రేలిమీద గుచ్చి రక్తంతీసి ఒక అద్దానికి రాసి పరీక్షచేసి ఏదో ఇంగ్లీషులో చెప్పాడు ఆ తండ్రికి.

తండ్రి రాణి వంక చూచాడు.

'మీ తాతని పిలుచుకురా' అన్నాడు.

పరుగెత్తింది రాణి.

క్షణంలో తాతను తీసుకుని వచ్చింది.

'నాకు నువ్వు పుత్రభిక్ష పెట్టాలి' అని తాత రెండు చేతులు పట్టుకొని వంద రూపాయలు ఆ తాత చేతిలో పెట్టబోయాడు ఆ తండ్రి కన్నీళ్ళతో.

'ఏం చెయ్యమంటారు, బాబూ, చెప్పండి? చినబాబుకోసం నా ప్రాణం ధారపొయ్యమన్నా పోస్తాను. అంతేగాని నాకు డబ్బెందుకు బాబూ?' అన్నాడు తాత.

ఆ మాటతో రాణికి ఎక్కడలేని సంతోషం వచ్చింది.

బాబు బ్రతికినట్లే భావించుకుంది.

'నువ్వేం చెయ్యనక్కరలేదు. మీ రాణి రక్తం కావాలి.'

'బాబూ!' అని అరిచాడు తాత.

'అవును. మీ రాణి రక్తం బాబు శరీరానికి సరిపోతుందని డాక్టర్లు చెప్పారు. మీ రాణి రక్తం యిస్తే మా బాబు బ్రతుకుతాడు' అని తాత రెండు చేతులూ పట్టుకుని 'నాకు పుత్రభిక్ష పెట్టవూ' అని అడిగాడు తండ్రి.

అమ్మగారు ఆశగా చూస్తున్నారు సమాధానం కోసం.

తాత చెప్పున అంగీకరిస్తే బాగుండునని అనుకుంటూంది రాణి. సంతోషంగా రక్తాన్ని యిద్దామనుకుంటూంది.

తాత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'బాబూ! తల్లి తండ్రి చిన్నప్పుడే చచ్చిపోయారు. నాకు రక్త స్పర్శ కూడా లేని పరాయి పిల్ల. నెలల గుడ్డును చేరదీశాను. పెంచి పెద్ద జేశాను. ఆమె రక్తాన్ని యిచ్చి ఆమె జీవాన్ని..... బలవంతంగా.....'

మాట్లాడలేకపోతున్నాడు తాత.

ఆపాదమస్తకం వణుకుతూంది.

'మా అమ్మ నాన్న బ్రతికుంటే నా రక్తాన్ని బలవంతంగా పిండి..... నించున్నపళంగా....నా ఉసురులు తీస్తారా తాతా! నీ కిది న్యాయమా ? నన్ను బలవంతంగా చంపేస్తావా? అని మా రాణి నన్ను నిలదీసి అడిగితే నేనేం చెప్పను బాబూ!' అన్నాడు తాత. భోరున ముఖం మూసుకుని ఏడుస్తున్నాడు.

ప్రాణంకన్న ఎక్కువగా పెంచిన తాత ఏడుస్తూంటే సహించలేకపోయింది రాణి. తాతను పట్టుకుంది. తానూ ఏడుస్తూంది.

నిరాశగా రాణివంక చూస్తూంది అమ్మగారు.

ఆ చూపులో నాకు పుత్రభిక్ష పెట్టవా అని తనను అడుగుతున్నట్లనిపించింది రాణికి.

'అమ్మా, రాణీ!' అని చేతులు పట్టుకుంది ఆ తల్లి వచ్చి.

రాణి హృదయం కదిలింది.

'భయం లేదమ్మా! ఏడవకండి. నా రక్తం వల్లే మీ బాబు బ్రతుకుతాడనే నమ్మకం మీకుంటే ఆనందంగా యిస్తానమ్మా' అంది రాణి.

'రాణీ!' అని అరిచాడు తాత.

తాత దగ్గరకు వచ్చింది రాణి.

'తాతా! దిక్కులేని నన్ను చేరదీసి పెంచి పెద్ద జేశావు. రామాయణం నాచేత చదివిస్తూ అర్థం చెబుతున్నావు. నీకు తెలియని దేముంది? మానవ ధర్మం ఏమిటో నీకు నేను చెప్పాలా? వారు మనకు యజమానులు. వారి అన్నం తింటున్నాం. ఈ శరీరం వారిది. వారు కోరింది రక్తమేగా? ప్రాణం కాదుగా? అయినా రక్తాన్ని దానం చేసినంత మాత్రంలో చచ్చిపోతానా? ఒకవేళ చచ్చిపోతే మాత్రం నష్టం ఏమిటి? బాబు....పవిత్ర మూర్తి.....నవనీతమైన హృదయం...అలాంటి మంచి బాబులు బ్రతికుంటే లోకానికి మేలు. తాతా! మనలాంటి జీవులు అలాంటి సహృదయులకోసం బలి అయిపోయినా ఆనందమేగా? నువ్వేం బాధ పడకు తాతా! ఆనందంగా రక్తాన్ని యిస్తాను.'

తాత మాట్లాడలేకపోయాడు.

తండ్రి ఆనందంగా రాణి దగ్గరకు వచ్చి—

'అమ్మా! నీ ఋణం మేం తీర్చుకోలేం. ఈ వంద రూపాయలూ నీ దగ్గర ఉంచుకో. తరువాత నీ ఆరోగ్యం కోలుకునేవరకు మందులకుంటాయి' అని వంద రూపాయలు రాణి చేతిలో పెట్టబోయాడు.

వెనక్కు తగ్గింది రాణి.

'బాబూ! క్షమించాలి. నేను చినబాబు ఆరోగ్యంకోసం రక్తాన్ని అమ్ముకోలేను. త్యాగం చెయ్యగలను. అంతే. అంతకన్న మీకేం చెప్ప లేను. పెద్దలు. సర్వం మీకే తెలుసు' అంది రాణి అతి వినయంతో.

ఆశ్చర్యపోయాడు తాత.

అమ్మగారి ఆనందానికి అంతులేదు.

'నీకు నువ్వే సాటి తల్లీ' అని రాణి రెండు చేతులూ పట్టుకుంది. రాణికి ఆనంద బాష్పాలు రాలాయి.

ఆ తండ్రి డాక్టరు కేదో చెప్పాడు ఇంగ్లీషులో.

డాక్టరుగారు రాణిని పిలిచారు లోని గది లోనికి.

రాణి గదిలోనికి వెళ్ళింది.

బిక్కు బిక్కుమంటూ కళ్ళనీళ్ళు తడుచుకుంటూ తాత బయటే నిలుచున్నాడు. వేయి దేవుళ్ళకు మ్రొక్కుతున్నాడు తన రాణి క్షేమం



వయ్యారాలు

చిత్రం—కె. ధర్మారావు (మద్రాసు-17)

కోసం.

లోపల డాక్టరు రాణి రక్తాన్ని తీశాడు. ఆ రక్తాన్ని బాబు శరీరం లోనికి ఎక్కించారు.

రాణికి స్పృహ తప్పింది. వెంటనే ఏవేవో ఇంజెక్షన్లు యిచ్చాడు డాక్టరు. కొద్ది సేపట్లోనే తెలివి వచ్చింది.

'బాబుకు ఏలా ఉంది' అని అడిగింది రాణి.

'బాబుకు యింక పరవాలేదమ్మా' అన్నాడు డాక్టరు.

'కావలసిన రక్తమంతా తీసుకున్నారా?' అంది.

మాట్లాడలేకపోయాడు డాక్టరు.

'బాబు మాట్లాడుతున్నాడా?'

'ఆఁ మాట్లాడుతున్నాడు.'

'ఒక్కసారి బాబుని చూడవచ్చా?'

డాక్టరుగారు ఏదో చెప్పబోయేసరికి తండ్రి అడ్డంవచ్చి వెంటనే తాతను పిలిచి రాణిని యింటికి తీసుకువెళ్ళమని, కొంచెం నీరసంగా ఉంటుందని, కంగారు పడక్కరలేదని, డాక్టరుగారు వచ్చి చూస్తూంటారని చెప్పాడు.

తాత సరేనని రాణిని ఇంటికి తీసుకువెళ్ళాడు.

రాణి మనస్సు మాత్రం బాబును చూడాలని ఆ గదిలోనే తారట్లాడుతూంది. శరీరం మాత్రం తాతతో యింటికి వెడుతూంది.

ఇంటివద్ద రాణి మంచంమీదనుండి లేవడం లేదు. నీరసంగా మాట్లాడుతూంది. తాత రాణి మంచంవద్దనే కూర్చున్నాడు. కాలం గడిచిపోతూంది. రాత్రి తాతకు నిద్ర పట్టలేదు. తెల్లవారింది. యజమాని డాక్టర్ని పంపుతాడేమో నని చూచాడు తాత. డాక్టరు రాలేదు. 'నాకేం పరవాలేదు తాతా! కొంచెం నీరసంగా ఉంది. అంతే. మళ్ళీ డాక్టరు ఎందుకు?' అంటూంది రాణి. కాని అనుక్షణమూ బాబు యోగక్షేమమే అడుగుతూంది. తాత మాత్రం అనుక్షణమూ రాణి ఆరోగ్య స్థితికోసమే తల్లడిల్లుతున్నాడు. బాబు తలంపే లేదు. మళ్ళీ ప్రొద్దు గ్రుంకింది.

తాతకు నిద్ర పట్టలేదు. మళ్ళీ తెల్లవారింది. ఆ రోజు దీపావళి.

'తాతా!'

'అమ్మా!'

'చినబాబు కేం ఫరవాలేదు కదూ?'

'ఫరవాలేదమ్మా.'

'ఇంక నేను చచ్చిపోయినా ఫరవాలేదు కదు తాతా!'

రాణీ! ఏం మాటలమ్మా అవి?' అన్నాడు తాత వణుకుతున్న స్వరంతో.

'అవును తాతా! మనం పుట్టినందుకు ఏదో విధంగా యితరులకు సాయపడితే అదే మానవ జన్మ ఎత్తినందుకు ఫలితమని అనేకసార్లు నాకు చెప్పేవుగా తాతా!'

'తల్లీ! నా పాఠం నాకే వప్పగిస్తున్నావా?'

'లేదు తాతా! పెంచిన మమకారంతో నీకు బాధగానే ఉంటుంది. సరేగాని తాతా! నాకు దోసెడు గులాబీ పువ్వులు కావాలి తాతా!'

'ఇంతే కదా తల్లీ! ఇప్పుడే పట్టుకు వస్తా' అంటూ లేచాడు.

'తాతా!'

'అమ్మా!'

'ఒకవేళ రాణి ఏదీ అని బాబు అడిగితే?'

'ఊఁ....అడిగితే ఏం చెప్పమంటావు తల్లీ?'

'అడిగితే....నేను లేవలేక పోతున్నానని, నీరసంగా ఉందని చెప్పకు. నీ రాణి....వస్తుంది... గులాబీలు తెస్తుంది అని చెప్పు....'

'అలాగేనమ్మా!' అని తోటలోనికి వెళ్ళాడు తాత.

ఒక్క మొక్కనూ ఒక్క గులాబీ పువ్వుకూడా లేదు. మొగ్గలు కూడా ఒక్కటీ లేకుండా త్రుంపి వేయబడి క్రిందపడి ఉన్నాయి. క్రిందపడ్డ మొగ్గలు కూడా అప్పుడే వాడిపోయాయి.

ఎందుకో శంకించాడు తాత. రాణి పీక ఎవరో నులుముతున్నట్లనిపించింది తాతకు. ఏదో కీడు రానున్నదని మనస్సు ఘోషించింది తాతకు.

కంగారుగా అన్ని మొక్కలూ వెతికాడు. ఒక్క మొగ్గ కూడా లేదు.

ఇదంతా కిటికీలోనుంచి అమ్మగారు చూస్తూనే ఉన్నారు. తాత లోనికి పరుగెత్తాడు.

అమ్మ ఎదురుగా వచ్చింది.

'ఏమిటమ్మా, యీ విడ్డూరం?' అన్నాడు కంగారుగా.

మాట్లాడలేకపోయింది తల్లి.

'ఎవరో గులాబీ మొగ్గలన్నీ త్రుంపివేశారమ్మా!'

కళ్ళ నీళ్ళు పెట్టింది తల్లి.

'ఏమిటమ్మా అది?' అన్నాడు లోని గదిలో మంచం మీదున్న బాబు.

'బాబూ!' అంటూ లోనికి వెళ్ళాడు తాత కన్నీళ్ళతో.

'ఎందుకు తాతా! ఏడుస్తావు?'

'రాణి లేవడం లేదు బాబూ!'

'జబ్బు చేసిందా?'

# రాణి

'అవును బాబూ.....! ఆ రోజు....ఆ రోజు. ఏమీ లేదులే బాబూ!'

'ఊఁ ఆ రోజు....ఏం జరిగింది తాతా?'

'ఏమీ లేదు బాబూ! కొంచెం నలత చేసింది. అంతే!'

'తగ్గిపోతుంది తాతా! తగ్గిపోతుంది. రాణి. నా రాణి....వస్తుంది...గులాబీలు తెస్తుంది.... నాకు తెలుసు!'

'బాబూ!'....అని ఏదో చెప్పబోయాడు తాత.

ఇంతలో అమ్మగారు దోసిలినిండా గులాబీలు తెచ్చి. 'గులాబీలకోసం ఏంపింది కదూ రాణి? నాకు తెలుసు. పిచ్చిపిల్ల. గులాబీలంటే ఇంకేమీ అక్కరలేదు. పట్టుకు వెళ్ళు. త్వరలోనే తగ్గిపోతుంది జ్వరం' అంది.

ఆశ్చర్యపోయాడు తాత. అమ్మగారి హృదయానికి జోహార్లు అర్పించాడు. గులాబీలతో పరుగున వచ్చాడు ఇంటికి.

'అమ్మా! రాణీ! ఇవిగోనమ్మా గులాబీలు.'

'తెచ్చావా, తాతా?'

'తెచ్చానమ్మా!' అని రాణి దోసిలిలో పోశాడు. చూచింది రాణి గులాబీల వంక.

'తాతా! ఈ గులాబీలు మన తోటలోనివి కావే!'


'అవునమ్మా! అమ్మగారిచ్చారమ్మా నీ కిమ్మని!'

'పువ్వులు నువ్వే కోసుకు రాలేకపోయావా తాతా?'

'తోటలోని గులాబీలన్నీ మొగ్గలతోసహా ఎవరో తుంపేశారమ్మా.'

'ఆ!' అంది రాణి. ఇంత మాట్లాడలేక పోయింది. గడిచిన గాథలు స్మృతి పథంలో మెరిశాయి. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'అమ్మా!' అన్నాడు తాత.



చతుర్భుజ దేవాలయం
(ఖజురహో)
ఫోటో—అంబటిపూడి శవర్తి (సంబల్‌పూర్)

'అవును తాతా! మొగ్గలోనే తుంపేశారు!'

'ఏమిటమ్మా?'

'నీ కర్మం కాదులే తాతా! అని దోసిలిలోని పువ్వులు వాసన చూచి, ఈ దిక్కులేని పిల్ల కడసారి కోరిక తీర్చావు తాతా!' అంది.'

'ఏమిటమ్మా ఆ మాటలు?'

'అవును తాతా! పుట్టినప్పటినుంచి పూల తోటల్లోనే పెరిగాను.

గులాబీలతోనే ఆడుకున్నాను.

గులాబీలతోనే పాడుకున్నాను.

గులాబీలతోనే నవ్వుకున్నాను.

గులాబీలే నేను; నేనే గులాబీలు. నాకు యీ ధోసెడు గులాబీలకన్న కావలసిం దేముంది తాతా!'

అని గులాబీల వంక చూచింది.

ప్రతి గులాబీ రేకులోనూ బాబు కనిపిస్తున్నాడు. ఏదో అంటున్నాడు కూడాను బాబు.

'ఈ తోటలోని పువ్వులు మొగ్గలతోసహా ఎవరైనా కోసేస్తే ఏంచేస్తావు?' అంటున్నాడు బాబు.

అవును. అప్పుడూ అడిగాడు. ఇప్పుడూ అడుగుతున్నట్లనిపించింది రాణికి.

హృదయాన్ని కోసి ఎర్ర గులాబీలుగాచేసి దోసిలిలో పోసి దోసిలిలోనే ప్రాణాలు విడుస్తానని తానన్న మాటలు తనకే ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆ సంఘటన కళ్ళకు గట్టినట్లు కనిపిస్తోంది. కళ్ళ నీళ్ళు కారుస్తోంది రాణి. 'బాబూ!' అని కెవ్వున కేక పెట్టింది. చేతిలోని గులాబీలు చేతిలోనే ఉన్నాయి. చూపు చూపులాగే ఉంది.

'అమ్మా!...అమ్మా!' అని పలకరించాడు తాత.

మాట్లాడలేదు రాణి.

డాక్టర్ని తీసుకుని అమ్మగారే వచ్చారు.

డాక్టరు చెయ్యి పట్టుకునేసరికే కొయ్యబారిపోయింది రాణి.

భావనలో హృదయాన్ని తరిగి ఎర్ర గులాబీలు చేసి బాబు దోసిలిలో పోసి ప్రాణ వాయువును అనంత వాయువులో కలుపుకున్న రాణి శరీరం మాత్రం గులాబీ పువ్వుల మధ్య ఉండిపోయింది.

అమ్మగారు సిరిసంపదలను, హోదాను ఒక ప్రక్కకు త్రోసి రాణి కాళ్ళమీద పడి భోరున ఏడ్చింది.

గదిలో రాణి రక్తాన్ని తీసేటప్పుడు ఆ తండ్రి తన కోటు జేబులో విడిచిన వంద రూపాయల నోటు రాణి మంచంమీద రెండు కన్నీటి బొట్లుతోపాటు వదలి టగ్గమవుతున్న హృదయంతో వెళ్ళిపోయాడు డాక్టరు.

తాత పిచ్చిగా నవ్వుతూ 'లేదు. రాణి చచ్చిపోలేదు....రాణి.....వస్తుంది....గులాబీలు తెస్తుంది.....'అని అరిచాడు. ★